అమృత్ కిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# మనకీ ఒక గూడుంది

-సి హెచ్. కామేశ్వరి

తెల్లవారుతోంది అన్న సూచనగా ఆకాశంలోని చుక్కలు అదృశ్యమవుతున్నాయి. చెట్లకొమ్మలలో పక్షుల కిల కిల రావాలు మొదలయ్యాయి.

నిశ్శబ్దం అలుముకొన్న పరిసరాలలో సవ్వడి ఆరంభమైంది.

అంతటి మహానగరంలో కూడా ఎక్కడినుంచో కోడికూత అలా అలా గాలిలో తేలుతూ వినవస్తోంది.

జరీ చుక్కలు కుట్టిన నల్లని మేలిముసుగు తీసి,



తన సౌందర్యాన్ని బహిర్గతం చేసేపడుచు పిల్లలా, ఆకాశం చీకటిని తొలగించి వెలుగురేఖలు జగతిపై ప్రసరింప చేసింది.

ఆరు బయట మంచంపై కూర్చొని, సిగరెట్ కాలుస్తోన్న రాజారావుకి తెల్లగా తెల్లవారింది కాని తనికిమటుకు రాత్రంతా నిద్రలేదన్న విషయం స్ఫురణలోకి వచ్చింది.

ఒక్క నిముషం ఆయనమనసు చింతాక్రాంత మయింది.

అంతలోనే సర్దుకొని మెల్లగా మంచం దిగి చుట్టూ పరికించి చూశాడు. జానకి లేచినట్లుంది. పెరట్లో అలికిడి వినవస్తోంది.

గేటు దగ్గర ఉన్న పాల ప్యాకెట్కై ఉంచిన కవరు లోకి తొంగిచూద్దామనుకొని, అంతలోనే నవ్వు కొన్నాడు తాను మెళకువగానే ఉన్నాడు పాలువస్తే కదా! అనుకొని అలవాటుగా, కిటికీ దగ్గరున్న చేతికర్ర అందుకొని మంచందగ్గరున్న చెప్పులు వేసుకొని వాకింగ్కి బయలు దేరాడు రాజారావు.

వేసవి కాలపు పిల్లవాయువులు ఆయన శరీరాన్ని స్పృశిస్తున్నాయి. గత రాత్రంతా ఎడతెగని ఆలోచనలతో నిద్ర పట్టని కన్నులు మండుతున్నాయి. శరీరమంతా బరువుగా, నొప్పులుగా అనిపిస్తోంది. అయినా వాకింగ్ మానబుద్ధి కాదు.

ప్రశాంతంగా ఉండే ఉదయపు వేళలో, సముద్ర పొడ్డున బీచ్రోడ్లో వాకింగ్ ఒక వింతైన అనుభూతి. ప్రతీ రోజూ ఎప్పటికప్పుడు క్రొత్తగా ఉంటుంది.

తన మనసులో మౌనంగా సంభాషించుకుంటూ ఏకాంతంలో తన కష్టసుఖాలు నెమరు వేసుకోవడం, కొత్త నిర్ణయాలు తీసుకోవడం తనకలవాటు. మరి తన కోరి తెచ్చుకొన్న తన సమస్యకి ఏ పరిష్కారం దొరుకు తుందో... మనసుకే వదిలేశాడు రాజారావు.

ఆయన అలా నడుస్తూనే ఉన్నాడుకానీ, ఆయన మనస్సు ఏవేవో జ్ఞాపకాలు తవ్విపోస్తోంది. ఆయన మౌనంగా అవలోకించుకుంటున్నాడు.

తన బాధలన్నీ మనసుతో కలబోసుకుంటున్నాడు. రెండు సంవత్సరాల క్రితం తాను రిటైరైన తర్వాత జరిగినవన్నీ గుర్తుకు తెచ్చుకుంటున్నాడు.

రాజారావు పదవీ విరమణ చేసి అప్పటికి నెలయింది. ఈలోగా తెలిసినవారందరూ "రిటైరై అయ్యారుకదా!" ఏం చేద్దామనుకుంటున్నారు?" ఎక్కడ ఉంటారు?" లాంటి ప్రశ్నలు అడుగుతూంటే రాజారావు గారికి కొంచెం దిగులుగా, గుండె గుబులుగా అన్పించేది.

మళ్ళీ అంతలోనే రిటైరై అయితేనేం?" నాకేం తక్కువ?" అనేఅభిజాత్యం పొడసూపేది.

పిల్లలందరూ "మీకు మళ్ళీ కొత్త బాల్యం వచ్చింది. హాయిగా మాలోఎవరి దగ్గరయినా ఉండండి. మీ మనవలతో ఉల్లాసంగా గడ పండి మాకు పెద్ద దిక్కుగా ఉండండి" అంటే తనూ, జానకీ ఉప్పొంగిపోయారు.

మన పిల్లలు నలుగురూ రత్నాలు ఆడపిల్లలు ఇద్దరూ, మగ పిల్లలు ఇద్దరేకాక, తమకొచ్చిన అల్లుళ్ళకీ. కోడళ్ళకీ తనన్నా, జానకన్న అపారమయిన గౌరవాభి మానాలు.

మనకి ఏ విధమైన చింతాలేదు. అందుకే ఎవరి దగ్గర ఉన్నా తమ రోజులు వెళ్ళిపోతాయి!" అని తనంటే జానకి ఊరుకోలేదు."

పిల్లలు ఎవరి దగ్గరా మనముండొద్దు. చక్కగా మనూర్లో ఉన్న మనసొంత ఇంటిలో ఉందాం. కుటుంబ బాధ్యతలతో నేనూ ఆఫీస్ బాధ్యతలతో మీరూ అలసి పోయాం. ఈ వయసులో మన మెలాంటి బాధ్యతలు మోయలేం." అని ఎంతగానో చెప్పింది. కానీ, తనే వినలేదు.

"నీ మొహం! వృద్ధాప్యంలో ఉన్న మనకు ఇందరు పిల్లలుండగా ఒంటరిగా గడపాల్సిన అవసరమేముంది? మన మెక్కడున్నా ఎవరికీ భారంకాము. మన ఖర్చు వాళ్ళకిచ్చేస్తాము. మన మందులు మనం కొనుక్కుంటాం. అలాంటప్పుడు మనల్ని నెత్తినెట్టుకొని చూస్తారు." అని వాదించి జానకిని ఒప్పించి పెద్దాడి దగ్గరకు వచ్చేశారు చివరికి ఏమయింది?

మిగతా పిల్లల దృష్టిలో పెద్దాడంటే మమకారం, ఎక్కువని అపోహ అలా కాదు పోనీ మిగతా వారి దగ్గర ఉందామంటే "మీకేం తక్కువ చేశాము. మేమెంత చేసినా ఏం లాభం. మీ ప్రేమంతా మిగతావాళ్ళపైనే.మా మీదేం ఉంది?" అని నిష్టూరాలు పెద్ద కోడలూ, పెద్ద కొడుకూ.

అసలు... మనిషి తన స్థాన బలిమి కోల్పోకూడదు. స్థాన బలిమి పోయాక వ్యక్తి గౌరవం, వ్యక్తి స్వాతంత్ర్యం పోతాయి. అందుకే, కుటుంబపెద్దగా గౌరవించి ప్రేమించిన సంతానం అందరికీ తనంటే, ఓ చులకనా భావం ఏర్పడింది.

అది ఏర్పడటానికి కారణం, తనదయిన గూడు ఒకటున్నా, మరొకరి 'కేరాఫ్లో' ఉండాలనుకోవడమే, తన తప్పు అనిపిస్తోంది.

ఈ తప్పువలనే 'ఒకరి దృష్టిలో తనది పక్షపాత ధోరణి.' మరొకరి దృష్టిలో చాదస్తపు మనిషి, వేరొకరి దృష్టిలో మొండి మనిషి. ఇంకా ఆడ పిల్లలూ, మగపిల్లలూ వాళ్ళలో వాళ్ళు వైషమ్యాలు సృష్టిం చు కోవడానికి కారణభూతుడు తానయ్యాడు.


తన మూలంగా జానకికి సూటిపోటి మాటలు. తాము మాట్లాడిన మాటలకీ, చేసిన చేతలకీ, వాఖ్యానాలూ, విమర్శలూ, సలహాలూ ఇవ్వన్నీ తనని. అంతర్గతంగా వేధిస్తున్నాయి. బాధిస్తున్నాయి.

ఒక మనవరాలిని మెచ్చుకుంటే, మరో మనవరాలికి కోపం, దాని తల్లి తండ్రిలకు కోపం. ఒక మనవడిని తిడితే మరొకరికి ఆనందం. ఇటువంటి వక్రప్రవర్తన తన కుటుంబంలో చోటు చేసుకోవడానికి కారణమెవరైనప్ప టికీ, వీరందరికీ సంబంధించిన వ్యక్తిగా, తనకీ, తన భార్యకీ వేదన కల్గుతోంది.

అదే జానకి చెప్పినట్లువిని రిటైర్ అయ్యాక ప్రశాంతంగా తమ ఇంటిలో తాముంటే వీళ్ళందరూ ఎప్పటిలాగే అప్పుడప్పుడు వస్తూ పోతూ ఉండేవారు.

తల్లితండ్రులపట్ల ప్రేమాభిమానాలు చెక్కు చెదిరేవి కావు. వాళ్ళలో వాళ్ళకీ అభిమానాలుండేవి"

దూరంగా ఉంటేనే ప్రేమలు నిలుస్తాయి" అని ఒక రచయిత్రి చెప్పినట్లు అసలు పిల్లలు ఎదిగాక వారు ఉన్నతంగా దూరపుకొండలుగా, నునుపుగా, స్వచ్ఛంగా కనిపిస్తారు తల్లితండ్రులకి. అందుకే వారి దగ్గర ఉండటానికి మోజు చూపుతారు.



## బిజీ ట్వింకిల్



డింపుల్ కూతురు 'ట్వింకిల్' తన తొలిచిత్రం 'బర్సాత్' విడుదలకు ముందే బోల్డన్ని చాన్సులు కొట్టేస్తోంది. ప్రముఖ నిర్మాత జి.పి.సిప్పీ నిర్మించే 'అగర్ తుమ్ న ఆతే' లో అక్షయ్ ఖన్నా సరసన ఎంపికయింది. అంతే కాదు అరవింద్ స్వామి ప్రక్కన కూడా నటించబోతోంది. అమితాబ్ బచ్చన్ కార్పోరేషన్ లిమిటెడ్' నిర్మించే చిత్రంలో అరవింద్ - ట్వింకిల్ జంట. ఇవే కాకుండా మరి కొంత మంది ప్రముఖ నిర్మాతలు సయితం ట్వింకిల్‌ని బుక్ చెయ్యడానికి ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. కూతురు ఇలా బిజీ అవుతూంట తల్లి డింపుల్ మాత్రం ఖాళీగా ఉంది, ప్చ్!

-మౌర్య.

వారి ఉన్నతికి కారణం తామే అని ఉప్పొంగిపోతారు. వారి చెంతచేరుతారు. కానీ క్రమేపీ వారి ఉన్నతత్వం తమని అదిమి వేయాలనిచూస్తే భరించలేరు. అది సహజం.

తమ విషయంలో ఇంచుమించు అదే పని జరిగింది. తామెక్కడుంటే అక్కడికి మిగతా సంతానం వచ్చేవారు. వారిని ట్రీట్ చేయడంలో ఏమాత్రం లోటు చేసినా తనకి బాధ కల్గేది.

కానీ, ఏమీ అనలేక పోయేవారు. తానూ జానకీ, ఆ వచ్చిన వాళ్ళు చిన్నబుచ్చుకొని వెళ్ళిపోవడం. క్రమేపీ మీ దగ్గరకు రావాలని ఉంది. కాని అది అనువుకాని చోటు అనిపిస్తోంది.

మొత్తానికి మీరు ఉండగానే పుట్టిల్లు ఆశలేకుండా చేశారు" అని ఆడపిల్లలు నిష్టూరాలు నిందలు వేసేవారు.

ఇవన్నీ విని రెచ్చిపోయేవారు తమని ఉంచుకొన్న వాళ్ళు.

చివరికి ఏ పిల్లల దగ్గరున్నా ఇదే పరిస్థితి. ఇంక ఈ పరిస్థితి ఇలా కొనసాగడానికి వీలులేదు. ఎవరి దగ్గరున్నా మిగతావారికి గిట్టదు.

తమ ఇంటికి వచ్చేవారు స్వచ్ఛ మైన మనసుతో రావాలి. ఈ ముదిమి వయసులో అందరూ కావాలి. తాము ఎవరినీ దూరంచేసుకోలేరు.

కుటుంబ కలహాలు క్రమేపీ పెంచుకొని ఉన్న మనశ్శాంతి దూరం చేసుకొని కొందరికే పరిమితంగా తాముండలేరు.

తమకంటూ ఒక 'గూడు' ఉన్నరోజు అమ్మమ్మ ఇంటికి వస్తున్నామని తమ కూతుళ్ళ పిల్లలూ బామ్మ ఇంటికి వస్తున్నామని కొడుకుల పిల్లలూ ఆనంద పడ్డారు.

అదే తాను ఒక కొడుకింటిలో ఉంటే వేరే కొడుకు కుటుంబం, కూతుళ్ళ కుటుంబం అక్కడికి రావడానికీ ఉండటానికీ లక్ష సాకులూ, విమర్శలూ చేస్తున్నారు, ఫీలయిపోతున్నారు.

తమనిబట్టి మిగతావారందరికీ చాకిరీ చేయాల్సి వస్తుందని తమని ఉంచుకొన్న వారు విసుగులూ, విమర్శలూ చేస్తున్నారు.

ఇప్పటివరకూ ఇలాగే నడిచింది. ఇక ముందు ఇలాగే ఉంటే భరించగలిగే ఓపిక తనలో లేదు. జానకి కూడా నలిగిపోతోంది.

తమ ఎదురుగానే తమ ఇంటిలో భాగాలకోసం కొడుకుల వాదన, జానకిబంగారం ఎవరెవరికి ఎంతెంత వస్తుందో, చర్చలు.

ఇవన్నీ కంటకప్రాయంగా ఉండి గుండెను తూట్లు చేస్తున్నాయి. అన్నీ ఉండీ ఏమిలేనట్లు "ఈ ప్రారబ్ధం ఎందుకు అనుభవించాలి?" అనుకునే సరికి రాజారావు తన మామగారూ అత్తగారూ గుర్తుకొచ్చారు.

వెంటనే తన మామగారిలాంటి వారసత్వం తనకి వద్దు, వందమంది కుటుంబ సభ్యులున్న ఆయన అత్తగారు చిట్టచివరిలో చిన్న కొడుకుపంచన చేరారు.

వాడికి అందరితోనూ శత్రుత్వమే! వాళ్ళని ఎంతో బాగాచూసేవాడు కానీ, ఇంకెవ్వరి నీ కంటితో చూడనీయకుండా కట్టడి చేశాడు.

అంతేకాక వారి గురించి శాపనార్థాలు పెట్టి తిట్టిపోస్తుంటే, అవి వినలేక వాళ్ళనెవర్నీ కంటితో చూడలేక మానసిక వ్యధతో అలమటిస్తూనే, అత్తగారు మామగారూ పోయారు.

యాధృచ్ఛికంగా తను కూడా ఇంచుమించు అదే వారసత్వం తెచ్చుకున్నాడు లాగుంది.

ఈ ఆలోచన మనసులోకి రాగానే రాజారావు గుండె ఝల్లుమంది. శరీరమంతా గగుర్పాటు చెందింది.

జరగబోయే అనర్థాన్ని ఆపాలన్నట్లు తనకు తానే స్వగతంలో "వద్దు ఆయన వారసత్వం నాకే కాదు ప్రపంచంలో ఏ తండ్రికీ వద్దు. పుట్టెడు సంతానముండీ, చివరలో ఎవరినీ చూడనోచుకొని పరిస్థితి ఎవరికీ రావొద్దు." నేనుకూడా మా స్వంత ఊరుపోయి జానకితో ప్రశాంతంగా గడుపుతాను. బహుశా జానకి కూడా తన తండ్రి పరిస్థితి దృష్టిలో పెట్టుకొనే చెప్పి ఉంటుంది.

తనే పెడచెవిన పెట్టాడు. ఇప్పటికయినా మించి పోయింది లేదు. వీలయినంత తొందరగా జానకితో తమ గూటికి తాము చేరుకోవాలి. గూడులేని పక్షుల్లాగా పిల్లల పంచలో చెరి చాలా తప్పు పని చేశాడు. ఆ తప్పు సరిదిద్దుకోవాలి.

మళ్ళీ తాను ఉద్యోగంలో ఉన్నప్పటిలాగే తానూ, జానికీ విడిగా ఉంటారు. పిల్లలు ఎప్పట్లాగే అప్పుడప్పుడూ వస్తూ పోతూ ఉంటారు.

ఎప్పుడు ఎవరిని చూడాలనిపిస్తే వారిని చూసి చుట్టపు చూపుగా వెళ్ళి వస్తుంటేనే బాగుం టుంది.

తనకి తన పిల్లలు ఏ రకంగానూ దూరమవ్వరు. వాళ్ళపై పెంచుకొన్న ప్రేమస్థానంలో వేరే భావాలు తనకీరావు. వారు తమపై పెంచుకొన్న గౌరవాభిమానాలకు భంగం వాటిల్లదు. ఇలా ఆలోచించుకొన్న రాజారావులో నూతనతేజం కల్గింది.

మనసు కల్గించిన ఈ ఆలోచనకు ఆయనలోని అశాంతి మాయమయింది. రాత్రి నుండి పడ్డవేదన దూరమయింది.

త్వరగా ఇంటికి వెళ్ళి జానకితో ఈవిషయం చెప్పాలి. "మనకీ ఓ గూడుంది, అందులో మనముందా"మని చెప్పాలి. జానకి కళ్ళల్లో వెలుగుని చూడాలనుకుని ఇంటిముఖం పట్టారు రాజారావుగారు. మనసు చెప్పిన పరిష్కారం ఇచ్చిన మనోధైర్యంతో...

సిహెచ్. కామేశ్వరి,
ఇం.నెం. 18-57/1, ఎమ్.ఇ.ఎస్ కాలనీ,
తిరుమలగిరి పోస్ట్,
సికింద్రాబాద్ - 15.




"మీ ఇంట్లో దొంగలు పడ్డా కిక్కురు మనకుండా ఉన్నావేం?"

"నోరు తెరిస్తే నా బంగారు కట్టుడు పళ్ళు లాక్కుపోతారే మోననీ."

-కె.శ్రీనివాస్(మల్లారం)
మం:మలహార్-505 184
కరీంనగర్ - జిల్లా.